క్లుప్తంగా

జిల్లా ప్రజలకు కలెక్టర్ శ్రీరామ నవమి శుభాకాంక్షలు



ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జిల్లా ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ధర్మం, ప్రేమ, సత్యం అనే గుణాలతో జీవితాన్ని సాగించడం నేర్పారన్నారు. సీతారాముల దీవెనలతో జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

చదువులో రాణించి ఉన్నత స్థానానికి చేరుకోవాలి



ఇన్వర్టర్,వాటర్ ప్యూరిఫయర్ అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

ఏలూరు (టూటౌన్): విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ఎస్ మధుసూదనరావు అన్నారు. వసతి గృహంలో విద్యార్థినులకు సురక్షిత మంచి నీరు అందించేందుకు వాటర్ ప్యూరిర్, ఇన్వర్టర్ ఏలూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి సిబ్బంది బహుమతిగా అందించారని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ అన్నారు. స్థానిక అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలూరు బ్రాంచి వారు సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా వీటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎంజికె మూర్తి, చీఫ్ మేనేజర్లు వీవీ సంజీవరావు, ప్రియదర్శిని, ఏఏఓ నాగార్జునరావు, అమీనాపేట బాలికల వసతి గృహం సంక్షేమ అధికారి జి.రాధ, ఎఎస్ డబ్ల్యుఓ త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఎస్వీ రామారావుకు కీర్తి పురస్కారం



కీర్తి పురస్కారం అందుకుంటున్న ఎస్వీ రామారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ముఖ్య సలహాదారు, సినీ విజ్ఞాన విశారద ఎస్వీ రామారావుకు హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం ప్రదానం చేసి సత్కరించింది. మంగళవారం హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రముఖులను 22 మందికి ఈ కీర్తి పురస్కారాలు ప్రదానం చేశారు. పరిశోధనా రంగానికి సంబంధించి తెలుగు సినీ గీతాలపై పరిశోధన చేసిన ఎస్వీ రామారావుకు ఈపురస్కారం అందించారు. పురస్కారం అందించిన వారిలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డీ. రవీందర్, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య తంగెడ కిషన్ రావు ఉన్నారు. ఎస్వీ రామారావుకు కీర్తి పురస్కారం లభించడంపై గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు, గురు ఇంజనీర్స్ అధినేత ఎంవీఆర్ఎస్ శర్మ శుభాకాంక్షలు తెలిపారు.

మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వండి



జిల్లా విద్యాశాఖాధికారి రవిసాగర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకన విధుల నుంచి వివిధ వర్గాలకు చెందిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో కలిసిన యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వయోభారంతో ఉన్న వారిని, ఎక్కువ సేపు కూర్చోలేని, ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారిని, దివ్యాంగ ఉపాధ్యాయులను ముందుగానే గుర్తించి మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. రవికుమార్, ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహారావు, కోశాధికారి ఎస్‌కే ముస్తఫా ఆలీ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

దెందులూరు: పోతునూరులో కోదండ రామాలయానికి సర్పంచ్ బోదుల స్వరూప్ రూ.25,116 విరాళం అందించారు. ఆయన తండ్రి బోదుల రాఘవులు పేరిట కోదండ రామాలయ నిర్మాణానికి ఈ విరాళం బుధవారం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ స్వరూప్‌ను అభినందించారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు
- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని
- 24వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం



ఏలూరు ఆదర్శనగర్‌లో మహిళలకు పథకాలు వివరిస్తోన్న ఎమ్మెల్యే ఆళ్లనాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనను మీ ముంగిటకు తీసుకువచ్చారని, దళారులు, మోసగాళ్ల ప్రమేయం లేకుండా నేరుగా ప్రతి పథకానికి సంబంధించిన లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే వేస్తూ సరికొత్త విధానాన్ని అమలు చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని చెప్పారు. నగరంలో 81 రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఏలూరు 24వ డివిజన్‌లోని ఆదర్శనగర్‌లో ఎమ్మెల్యే నాని ఇంటింటికీ పాదయాత్రగా వెళుతూ పథకాలను ప్రజలకు వివరించారు. డివిజన్ కార్పొరేటర్ మాదిరి నిర్మల జేవియర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి అపూర్వ స్వాగతం పలికారు. ఆయన ప్రతీ ఇంటికీ వెళ్లి పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా మహిళలు ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను ఆయన వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే వాటిని సరిచేసి పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ వ్యవస్థ అమల్లోకి తేవటంతో ప్రజలకు సంబంధించిన ప్రతి పనీ సునాయాసంగా పూర్తవుతోందని, గతంలో మాదిరిగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి లేదన్నారు. ప్రభుత్వ పథకాలకు వలంటీర్ ఇంటికి వచ్చి మరీ దరఖాస్తు చేస్తున్నారని, సమీపంలోనే సచివాలయంలో అన్ని పనులు పూర్తవుతున్నాయని చెప్పారు. అవ్వాతాతలకు ఉదయాన్నే కోడి కూయక ముందే వలంటీర్ ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్ ఇస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, బండారు కిరణ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు నున్న స్వాతి శ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, యర్రంశెట్టి సుమన్, కలవకొల్లు సాంబ, అద్దంకి హరిబాబు, గరికిముక్కు జయకర్, ఏఎంసీ డైరెక్టర్లు జక్కుల బెనర్జీ, సాసుపల్లి యుగంధర్ ప్రసాద్, మేతర సురేష్, పార్టీ నాయకులు మట్టా రాజు, రాజారావు, ఈదుపల్లి పవన్, బీసీ సెల్ నాయకులు పారిపిరెడ్డి నాగేశ్వరరావు, బొగిశెట్టి పార్వతి, బాలత్రిపుర సుందరి, అన్సారీ, సరిత, సబ్బిత రాజేంద్రప్రసాద్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, పీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ సోమశేఖర్, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

నగదు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు, తర్ఫీదు ఇచ్చిన శిక్షకులకు నగదు పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకులు బి.శ్రీనివాసరావు బుధవారం చెప్పారు. దేశ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు అనుసరించి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల క్రీడాకారులను ఉద్దేశించి ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. 2022 ఫిబ్రవరి 11 ముందు అంతర్జాతీయ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు వారికి తర్ఫీదు ఇచ్చిన శిక్షకులకు నగదు పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కోరుతూ ఉత్తర్వులిచ్చినట్లు తెలిపారు. అర్హులు ఏప్రిల్ 30లోగా వెబ్‌సైట్ ద్వారా అప్లికేషన్లను డౌన్‌లోడ్ చేసి, డిపార్టుమెంట్ ఆఫ్ స్పోర్ట్స్ పోర్టల్ ద్వారా మాత్రమే అప్లికేషన్‌ను పూర్తి చేసి అందజేయాల్సి ఉందన్నారు. ఈ సదావకాశాన్ని జిల్లాలోని అంతర్జాతీయ క్రీడాకారులు, శిక్షకులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గతేడాది 10వ తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను అవమానించే విధంగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతేడాది కడప, చిత్తూరు, ఏలరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో 10వ తరగతి పరీక్షల సందర్భంగా మాల్ ప్రాక్టీస్ కేసుల్లో చిక్కుకున్న ఉపాధ్యాయులను ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు జరిగే అన్ని రోజుల్లో అంటే ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం ముమ్మరం

ఏలూరు (టూటౌన్): ఎంతో ప్రతిష్టాత్మకమైన ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 31న జరుగనున్నాయి. దీంతో పోటీలో నిలిచిన అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అధ్యక్ష రేసులో ఉన్న రెండో అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెల్లే రాజేంద్రప్రసాద్, ఇతరత సీనియర్ న్యాయవాదులు, ఏపీపీలతో కలిసి బుధవారం కోర్టు ప్రాంగణంలో పలువురు న్యాయవాదులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలను ముద్రించి పంపిణీ చేసారు. ప్రచార కార్యక్రమంలో ఏపీపీలు ఆచంట వెంకటేశ్వరరావు, డీవీ రామాంజనేయులు, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల వద్ద ఇప్పటికే చలువ పందిళ్లు వేసి ఆలయాలకు రంగులు వేసి నిత్యనూతనంగా తీర్చిదిద్దారు. గురువారం శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఆయా ఆలయాల్లో కల్యాణ మహోత్సవం నిర్వహించి భక్తులకు పానకం వడపప్పు ప్రసాదాలు అందించడానికి సర్వం సిద్ధం చేసుకున్నారు. స్థానిక అమీనాపేటలోని రిజర్వ్ పోలీస్‌లైన్‌లో శ్రీ దాసాంజనేయస్వామి ఆలయంలో మధ్యాహ్నం 12.02 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఆలయం వద్ద ఏప్రిల్ 3వ తేదీ వరకూ నిత్యం విశేష పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏప్రిల్ 4న ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించనున్నారు. 40వ డివిజన్లో ఫ్రెండ్స్ యూనిటీ సెంటర్ వద్ద శ్రీరామ మందిరంలో భద్రాద్రి సీతారామ స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో అమీనాపేట విద్యుత్ రామాలయంలో 18వ వార్షిక సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. రామచంద్రరావు పేట సుబ్బమ్మ దేవి స్కూల్ రోడ్డులోని కోదండ రామాలయంలో, దొండపాడు నందత్తనాథ క్షేత్రంలో, నరసింహరావు పేటలోని షిరిడీ సాయి మందిరంలో, పవర్‌పేట బడేటి వారి వీధిలోని కోదండ రామాలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని కోదండ రామాలయాల్లో కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు.



40వ డివిజన్‌లో సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్న కమిటీ ప్రతినిధులు



అమీనాపేటలో రామాలయం వద్ద కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



మందిరంలో విశేష అలంకరణలో కోదండ రామస్వామి



చేపల మార్కెట్‌లో సీతారామ కల్యాణ మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చేపల మార్కెట్‌లో శ్రీరామనవమి ఉత్సవాలు

ఏలూరు (టూటౌన్) : స్థానిక గజ్జెలవారి చెరువు ప్రాంతంలోని చేపల మార్కెట్ ప్రాంతంలో భక్తాంజనేయ ఫిష్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఫిష్ సీడ్స్ సప్లయిర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 42వ సీతారామ కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక చేపల మార్కెట్ ప్రాంతంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఉత్సవాలను ఈనెల 30 నుండి ఏప్రిల్ 6 వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతా రాజు, ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, కార్యదర్శి బలే మాణిక్యాలరావు, జాయింట్ సెక్రెటరీ మిడతా రామ్ తేజ, కోశాధికారి రాజా మురళీ కృష్ణ, ఆర్గనైజర్స్ పైలా సింహాచలం, పైలా కనకారావు పాల్గొన్నారు.

అగ్గిపుల్లలపై సీతారాముల ప్రతిమలు



అగ్గిపుల్లలపై సీతారామ, లక్ష్మణ, ఆంజనేయుని ప్రతిమలు తయారు చేసిన మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్‌బాబు

ఏలూరు (టూటౌన్): అగ్గిపుల్లలపై చిత్రాలను గీసి, సూక్ష్మ ప్రతిమలను తయారు చేసి ఏలూరుకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్ బాబు అబ్బురపరుస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా సురేష్ బాబు అగ్గిపుల్లలపై సీతారామ, లక్ష్మణ, హనుమంతుని ప్రతిమలు తయారు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నగర ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలు సురేష్ బాబుకు అభినందించారు.

ఏలూరు అభివృద్ధే ప్రధాన అజెండా



ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ షేక్ నూర్జహాన్, హాజరైన సభ్యులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ నూతన బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేయటం, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే తమ ప్రధాన అజెండాగా కౌన్సిల్ పేర్కొంది. ఏలూరు కార్పొరేషన్ 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఆమోదముద్ర పడింది. బుధవారం ఏలూరు నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో పాలకవర్గం ఏర్పడిన అనంతరం 2వ కౌన్సిల్ సర్వసభ్య ప్రత్యేక సమావేశం జరిగింది. ఏలూరు నగర ప్రథమ పౌరురాలు షేక్ నూర్జహాన్ అధ్యక్షతన బడ్జెట్‌ను ప్రతిపాదించారు. గతంలో కంటే భారీ బడ్జెట్‌ను రూపొందించిన నగరపాలక సంస్థ అధికారులు కౌన్సిల్ ముందు ఆమోదానికి ఉంచారు. తొలుత అధ్యక్షుల ఆదేశాలతో హెల్త్ సెక్షన్ సూపరింటిండెంట్ ఎండీ సిరాజుద్దీన్ కౌన్సిల్ ఆమోదానికి బడ్జెట్ ప్రతిపాదనలు సభ్యుల ముందు చదివి వినిపించారు. అనంతరం సభ్యుల హర్షధ్వానాల మధ్య బడ్జెట్‌ను కౌన్సిల్ అమోదించింది.

ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని అభివృద్ధితోపాటు ప్రజలకు మెరుగైన సేవలు, సౌకర్యాల కల్పనకే పాలకవర్గం పెద్దపీట వేస్తుందన్నారు. గతంతో పోల్చితే 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను మరింత మెరుగ్గా రూపొందించామని, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని సహకారంతో నగరాన్ని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఏలూరు కార్పొరేషన్ విస్తరిస్తోన్న నేపథ్యంలో ఆదాయం, ఖర్చులు, ప్రజలకు ఉత్తమ సేవలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను రూపొందించామని చెప్పారు. ప్రజారోగ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలకే నిధులు భారీగా వెచ్చించేలా ప్రత్యేక శ్రద్ధ వహించామని చెప్పారు. ప్రజారోగ్యానికి సంబంధించి రూ.26.64కోట్లు, తాగునీటికి రూ.19కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు.

ఏలూరు నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేయటంలో ఎమ్మెల్యే ఆళ్ళనాని ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తున్నారని తెలిపారు. నగరంలోని రోడ్లు, డ్రెయినేజీలు, సెంటర్ లైటింగ్, తాగునీటి అవసరాలు వంటివాటిపై ప్రధానంగా దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తాజా బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే తమ ప్రధాన లక్ష్యం అన్నారు. ఇక కార్పొరేషన్‌కు ఆదాయాన్ని సమకూర్చేవాటిపై దృష్టి సారించి, ఆదాయ వనరులు పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాజాగా తీసుకున్న నిర్ణయంతో కార్పొరేషన్‌కు పన్ను బకాయిలు వసూలు పెరిగిందన్నారు. గతం ఏడాదితో పోల్చితే ప్రస్తుతం నిర్ధేశించిన టార్గెట్‌లో రూ.9కోట్లు పైగా పన్ను వసూలు చేయగలిగామనీ, మరో మూడు రోజుల్లో రూ.7కోట్లు వరకూ వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పన్నులపై వడ్డీ రాయితీ కల్పించటంతో నగరంలోని పలు విద్యాసంస్థలు, ఇతర వ్యాపార వర్గాలు పన్ను చెల్లింపులకు ముందుకు రావటం హర్షణీయమన్నారు.

ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పాలకవర్గం మంచి బడ్జెట్‌ను రూపొందించిందని తెలిపారు. కార్పొరేషన్ యాజమాన్యంలోని స్కూళ్ళను పాఠశాల విద్యకు అప్పగించామని, కానీ నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను వదిలేయటంతో పాఠశాలల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. పాఠశాలల్లోని స్వీపర్ల జీతాలను చెల్లించేందుకు పాలకవర్గం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏలూరు నగరపాలక డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, అదనపు కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ కే.వెంకటేశ్వరరావు, సెక్రటరీ ప్రభుదాస్, నగరపాలక సంస్థ అధికారులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్ అందజేత

ఏలూరు (టూటౌన్): ఏలూరు రూరల్ మండలంలోని గుడివాక లంక గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ రంగమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.1.50లక్షల చెక్‌ను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి బుధవారం స్వయంగా బాధిత ఇంటికి వెళ్లి అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఏలూరు ఎంపీపీ పెనుమత్స శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మండల కొండలరావు, తేరా ఆనంద్, పల్లెం ప్రసాద్, ముంగర సంజీవ్ కుమార్, జయమంగళ రామారావు పాల్గొన్నారు.



చిట్టిబొమ్మ రంగమ్మ కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి రూ.1.50లక్షల చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

భాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే అబ్బయ్య

ఏలూరు (టూటౌన్): ఏలూరు మండలం పైడి చింతపాడుకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సైదు సత్యనారాయణను, ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి బుధవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సైతు సత్యనారాయణ కుమారుడు బాలకృష్ణ మరణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు

ఏలూరు రూరల్: అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి సోమశేఖర్ హెచ్చరించారు. మంగళవారం 'సాక్షి'లో చాటపర్రులో అక్రమ తవ్వకాలు శీర్షికతో వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. బుధవారం ఏలూరు మండలం చాటపర్రు జనార్దనస్వామి చెరువును ఆయన పరిశీలించారు. అక్రమార్కులు పొక్లైన్‌తో తవ్విన గోతులు గుర్తించారు. మట్టి తరలింపుపై ఆరా తీసారు. అనంతరం ట్రాక్టర్లతో తరలించిన మట్టితో మెరక చేసిన లేఅవుట్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ చెరువులో మట్టి తరలించే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.



చాటపర్రు జనార్దనస్వామి చెరువు పరిశీలిస్తున్న తహసీల్దార్ సోమశేఖర్

మెరక చేసిన భూమి యజమానులను గుర్తించి తరలించిన మట్టి విలువ రాబడతామన్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామన్నారు. తహసీల్దార్ క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నారని తెలుసుకున్న అక్రమార్కులు ట్రాక్టర్లు, పొక్లైన్‌ను తరలించారు. అక్రమార్కులకు సహకరిస్తున్న గ్రామాధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దళిత క్రైస్తవులకు సోము వీర్రాజు క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు దళిత క్రైస్తవుల పట్ల అవగాహన లేకుండా మాట్లాడటం తగదని తక్షణం ఆయన దళిత క్రైస్తవులకు క్షమాపణలు చెప్పాలని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు కోరారు. స్థానిక లంకపేటలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసెంబ్లీలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ తీర్మానం చేస్తే దానిపై అవగాహన లేకుండా సోము వీర్రాజు మాట్లాడటం తగదన్నారు. సోము వీర్రాజు మాటలు భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే ఉన్నాయన్నారు. ఈ దేశంలోని ప్రజలకు మత స్వేచ్ఛ హక్కు ఉందని, ఎవరు ఏ మతాన్ని అయినా స్వీకరించవచ్చునన్నారు. సోము వీర్రాజు తన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో పాస్టర్ డేవిడ్, భాస్కర్, బ్రదర్ మధు పాల్గొన్నారు.

బీజేపీ కన్వీనర్, కో-కన్వీనర్ల నియామకం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా గాదె రాంబాబు, కో–కన్వీనర్‌గా బాడిత నారాయణరావును నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా నియమితులైన రాంబాబు, నారాయణరావును బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొర్లళ్ల సుధాకర కృష్ణ, జిల్లా కార్యాలయ కార్యదర్శి పసుపులేటి మనోహర్ ప్రసాద్ బుధవారం వారిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కొరళ్ళ సుధాకర్ కృష్ణ మాట్లాడుతూ గాదె రాంబాబు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, బాడిత నారాయణరావు ఏలూరు సెంట్రల్ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నారన్నారు. నగరంలో బీజేపీ పటిష్టత, బలోపేతం చేసేందుకు ఇరువురు నాయకులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇరువురి నాయకులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేసారు.